# నిప్పులు చెరిగిన అశోక్

విజయనగరం - న్యూస్‌టుడే: మంగళవారం కలెక్టరేట్ వద్ద నిర్వహించిన దేశం మహాధర్నా కార్యక్రమంలో పొలిట్‌బ్యూరో సభ్యుడు పూసపాటి అశోకగజపతిరాజు తన సహజ ధోరణికి భిన్నంగా ప్రసంగించారు. మంత్రులు, ప్రజాప్రతినిధుల అవినీతిపై తెలుగు, ఆంగ్లం మిళితమైన తనదైన యాసలో విరుచుకుపడి జనాన్ని ఆకట్టుకున్నారు. ముఖ్యమంత్రి అవినీతికి ఒక చెయ్యి బొత్స సత్తిబాబు అయితే... మరో చెయ్యి విజయరామరాజు అని విమర్శించారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తుందని, వీరందరికీ శ్రీకృష్ణ జన్మస్థానం తప్పదన్నారు. అది గొప్ప సేవకులుగా కాదని, గొప్ప అవినీతిపరులుగా వెళతారన్నారు. గోస్తనీ, చంపావతి నదుల్లో ఇసుక తవ్వకాలను ప్రోత్సహించి తాగునీటి కష్టాలు తెస్తున్నారన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం రైతుబజార్లు తీసుకువస్తే, ఇక్కడ ఎరువులు నుంచి అన్నీ నల్లబజారుల్లో కొనుగోలు చేసే దుస్థితికి చేర్చారన్నారు. చివరకు ఆరోగ్యశ్రీ కార్డులకు కూడా లంచం ఇస్తే గానీ పని కాని పరిస్థితులు తలెత్తాయని దెప్పిపొడిచారు. అలాగే తెదేపా అగ్ర నేతలు కళా వెంకటరావు, యనమల రామకృష్ణుడులు సునిశితమైన విమర్శలు చేయగా, యర్రన్నాయుడు విశ్వరూపం చూపారు. ఎమ్మెల్సీ దాడి వీరభద్రరావు, నన్నపనేని రాజకుమారి, తూర్పుగోదావరి జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే బొడ్డు భాస్కరరామారావు, మాజీ ఎంపీ డీవీజీ శంకరరావు, ఎమ్మెల్యేలు పతివాడ నారాయణస్వామినాయుడు, పడాల అరుణ, తెంటు లక్ష్మునాయుడు, మాజీ ఎమ్మెల్యేలు గద్దె బాబూరావు, శోభా హైమావతి, నిమ్మక జయరాజు, పొట్నూరి సూర్యనారాయణ, కోళ్ల అప్పలనాయుడు, భంజ్‌దేవ్ తదితర నేతలు కార్యక్రమం విజయవంతం చేసేందుకు అహర్నిశలు శ్రమించారు.